# చెట్లు కూలుతున్న దృశ్యం

చలి ముదిరి ఎముకలు జివ్వుమంటున్న ఢిల్లీలో కేవలం ముతక నూలు దుస్తులతో వచ్చి ఇంటి ముందు నుంచుని పలకరిస్తున్న ఆ పెద్దమనిషిని దీక్షితులు ఒకంతట పోల్చుకోలేక పోయాడు. అంత చనువుతో తెలుగులో దీక్షితులును పిలిచేవాళ్లు ఈ ఢిల్లీలో లేరు.

ఆ వచ్చిన పెద్దమనిషి తన వయసువాడే. మెడ మీద పడుతున్న నెరసిన జుత్తూ, నెరసిన పొడుగాటి గెడ్డమూ, ప్రకాశిస్తున్న రాగి రంగు శరీరచ్ఛాయతో కళ్ల ముందే ఉన్నా ఆయన్ని దీక్షితులు గుర్తుపట్టలేక పోయాడు. జనవరి నెల నాలుగు డిగ్రీల సెల్సియస్ చలికి కేవలం చొక్కా పైజామాలతో, చెప్పులతో వచ్చిన ఆ పెద్దమనిషిని చూసి, మాట్లాడుతున్న టెలిఫోన్‌ని పక్కకి పెట్టి ఎదురు వచ్చాడు దీక్షతులు. డాక్టర్ సత్యం ఆ పెద్దమనిషిని తన దగ్గరకు తీసుకు రావటాన్ని బట్టి అతడు తన చిన్ననాటి స్నేహితుడు కావచ్చులే అనుకొని సంబరపడ్డాడు దీక్షితులు.

"పోల్చుకోలేవులే. సత్యం ముందే చెప్పి వీడిని ఇక్కడకు తీసుకువచ్చి నందువల్ల చిన్ననాటి దీక్షితులును వీడు పోల్చుకోగలిగాడు. అదే ఈ పత్రికా రచయిత ఏ కన్నాట్ ప్లేస్‌లోనో, లేదా కరోల్ బాగ్‌లోనో కన్పించాడనుకో — వీడు పోల్చుకోగలిగే వాడేనా?"

దీక్షితులు సాదరంగా లోపలికి తీసుకువెళ్లాడు ఆ పెద్దమనిషిని.

సత్యం ఇంటిమనిషిలా చనువుగా వెళ్లి ఓ మూల టెలిఫోన్ దగ్గర పడి ఉన్న గార్డియన్, వాషింగ్టన్ పోస్ట్‌వంటి విదేశీ న్యూస్‌పేపర్లు తెచ్చుకుని సోఫాలో కూర్చున్నాడు. హాలులో నేలంతా పరుచుకున్న ముదురు ఆకుపచ్చరంగు మెత్తటి

తివాచీ. నేలను తాకే లేతనీలంరంగు కిటికీతెరలు. అలంకారంగా జాడీల్లో పెంచుతున్న పచ్చటిమొక్కలు. ఓ మూలన మూడడుగుల ఎత్తు రోజ్‌వుడ్ స్టూల్ మీద చోళుల కాలం నాటి రెండడుగుల నటరాజ కాంస్య విగ్రహం. మెట్ల గది అరుగు మీద ఒక యౌవన స్త్రీమూర్తి నిలువెత్తు లోహ శిల్పం. రెండు అందమైన బీరువాల్లో నిండా పుస్తకాలు. గాంధీ మహాత్మునితో మాట్లాడుతున్న పైలాపచ్చీసు వయసునాటి దీక్షితుల పాతకాలం ఫోటో. అమృతాషెర్‌గిల్, ఎం.ఎఫ్. హుస్సేన్, రామ్‌కుమార్, శైలజ్ ముఖర్జీ... వర్ణ చిత్రాలు.

"వీడు అవతారంరా. విశాఖపట్నం మిసెస్ ఎ.వి.ఎన్. కాలేజీ హైస్కూల్‌లో ఈ ఇద్దరుస్నేహితులు కలిసే చదువుకున్నారు. దీక్షితులు ఫోర్త్‌ఫార్మ్ పరీక్ష రాసేసి వాళ్ల నాన్నగారితో మద్రాసు వెళ్లిపోయాడు. తర్వాత ఈ నేస్తాలు కలుసుకోనేలేదు. దీక్షితులు నాన్నగారు స్వరాజ్యం వాళ్లతో జైలుకు వెళ్లినట్టు పత్రికల్లో చదవడం ఇంకా గుర్తుంది. దీక్షితులు చదువు ముగించక ముందే కాంగ్రెస్‌లో చేరి జాతీయపతాకం పట్టుకుని పోలీసుదెబ్బలనీ, జైలుశిక్షలనీ అనుభవించాడనీ పత్రికల్లో వార్తలు వచ్చేవి. మొట్టమొదట కృష్ణంరాజు అనుకుంటాను, దీక్షితులు హిందూ పత్రికలో రిపోర్టర్‌గా చేరాడని చెప్పాడు. దీక్షితులు తర్వాత కొన్నాళ్లు బాంబేలో మరో ఇంగ్లీషుపత్రికలో చేరేడని, తర్వాత లక్నో వెళ్లాడని, అక్కడినుంచి ఢిల్లీ వచ్చాడని—వాడి భోగట్టాలు వీడు వింటూనే ఉన్నాడు. కొంతకాలం లండన్‌లో ఒక పెద్ద దిన పత్రికలో పనిచేసి వచ్చాడని కూడా తెలిసింది. వాడు ఎడిటర్ గా ఉన్న ఇంగ్లీషు దినపత్రికనూ తెప్పించుకునో లేదా హిందూ రీడింగ్ రూమ్ వాళ్లకి చెప్పి తెప్పించో లేదా ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రరీలో చదివో, ఆ పత్రిక ప్రతి పేజీలో తన చిన్ననాటి నేస్తం రూపంచూసి వీడు ఉప్పొంగిపోయేవాడు. దీక్షితులుకు అవతారం రాసిన ఉత్తరాలు కొన్ని సగంలో, కొన్ని పోస్ట్‌కు అంతా సిద్ధం చేసి — ఇంకా ఉన్నాయి వీడి ఫైల్స్‌లో. దాదాపు ఏభై అయిదేళ్ల తర్వాత ఈ స్నేహితులు తొలిసారి ఈ డాక్టరుగారి సహాయంతో కలుసుకోవడం. ఇప్పుడు అవతారంకి అరవై ఎనిమిది ఏళ్లు నిండాయి. దీక్షితులదీ అదే వయసు. అప్పట్లో క్లాసులో వీళ్లిద్దరే చిన్నవాళ్లు. లెక్కల మాస్టరు నారాయణ స్వామిగారు ఈ ఇద్దర్నీ ఎప్పుడూ క్లాసులో మెచ్చుకునేవారు. పోల్చుకున్నావా?"

"ఇన్ని ఆనమాలు చెప్పాల్నా?"

తెలుగుదేశాన్ని నాలుగు దశాబ్దాల కిందట విడిచి పెట్టేసిన దీక్షితులు తెలుగుభాషను ఎంతో అభిమానంగా కాపాడుకుంటూ వచ్చాడు. తెలుగువాళ్లతో

తెలుగులో మాట్లాడటం ఎంతో ఇష్టం. తెలుగు స్నేహపు మాటలు చెవిని సోకే సరికి అతడి హృదయం మంచులో తడిసిన పువ్వులా ఆర్ద్రమయింది.

ఏభైఅయిదేళ్ల జ్ఞాపకాల అట్టడుగున పడి ఉన్న స్నేహసౌందర్యాన్నీ, విచ్చుకుంటున్న ఆనాటి బాల్యాన్నీ అవతారం ముఖంలో చూసి మురిసి పోయాడు దీక్షితులు.

"అవునవును. ఎ.వి.ఎన్. కాలేజీ చింతచెట్టు కింద మనం ఆడుకునే వాళ్లం" అన్నాడు దీక్షితులు.

"ఒరేయ్ దీక్షితులూ, ఆ చింతచెట్టు ఇప్పుడు లేదురా. దాదాపు ఇరవైయ్యేళ్ల కిందట ఓ వర్షాకాలం ఇట్టే కూలిపోయిందిరా. ఎన్నో గాలివానలకు సైతం లెక్కచెయ్యని చింతచెట్టు ఒక వర్షపురాత్రి మామూలువర్షానికే కూకటివేళ్లతో కూలిపోయిందిరా" అన్నాడు అవతారం.

తల్లిలాంటి చెట్టు కూలిపోయినందుకు తల్లడిల్లి పోయాడు దీక్షితులు. ఆ కాలేజీ ఆవరణంలో ప్రవేశద్వారం దగ్గర పచ్చని ఆ చెట్టు అందం కళ్లలో నిలిచిపోయింది. అంతలో టెలిఫోన్ సంగతి గుర్తుకొచ్చి అటువెళ్లి టెలిఫోన్ అందుకుని 'నువ్వు రాష్ట్రపతిని కలుసుకున్న తర్వాత రాత్రికి ఇక్కడికి రా. విషయాలు మాట్లాడుకుందాం' అని టెలిఫోన్ పెట్టేశాడు దీక్షితులు. ఫోన్‌లో తెలుగులోనే మాట్లాడటంతో అవతలి వాడు ఎవరో తెలుగు పెద్దమనిషే అని బోధపడింది అవతారానికి.

ఈ కథ సత్యంకి తెలిసిందే. రాజ్యసభ సభ్యత్వం కోసం ఒక ప్రముఖ తెలుగు దిన పత్రిక సంపాదకుడి పాట్లు. ముగ్గురున్న జాబితాలో అతడి పేరు చేరింది. ఈ రెండుమూడు రోజుల్లో పేర్లు ప్రకటిస్తారు. ప్రధానమంత్రి కార్యాలయంలో కూడా మొగ్గు అతడికే ఉంది. ఈ పార్లమెంట్ సభ్యత్వం వస్తే కొడుకులకూ, కూతుళ్లకూ, అల్లుళ్లకూ ఉన్నత పదవులూ, పరిశ్రమలూ, పెద్దపెద్ద ఏజెన్సీలూ సంపాదించు కోవచ్చు. దానికి పునాదిగా గత మూడేళ్లనించి ప్రతిపక్షాల మీద దండెత్తి పాలకపక్షం మన్ననలు పొంది ఆ సంపాదకుడు ఈ దశకు చేరాడు. ఆంధ్రదేశంలో పెద్ద పేరున్న సంపాదకుడి నిజరూపం దీక్షితులు దగ్గర సత్యం చూసి విభ్రాంతి చెందాడు. ఘనత వహించిన ఆ సంపాదకుడిని దీక్షితులు ప్రోత్సహించటం నచ్చలేదు. భరించలేక పోయాడు. సత్యం ఓసారి నిలదీస్తే 'నా చుట్టూ ఉన్న వాళ్లంతా ఇలాంటి వాళ్లే' అని బాధపడ్డాడు దీక్షితులు.

ఇంకా ఉదయం ఎనిమిది గంటలన్నా కాలేదు, దీక్షితులు ఫుల్‌సూట్‌లో ఉన్నాడు. దాంతో సత్యంకి సందేహం కలిగింది, బైటికి బయల్దేరే కార్యక్రమం ఏదన్నా

ఉండి సిద్ధమవుతుండగా తాము వచ్చిపడ్డామేమోనని. కారు బైటనే ఉంది. డ్రైవర్ కోసం ఎదురు చూడటమో, వేరే వారి కోసం వేచి ఉండటమో కాదు కదా! 'మీరు బయల్దేరుతున్నట్టున్నారు' సత్యం సగంలో ఆగిపోయాడు.

"ఉదయం పాలం వెళ్లాల్సి వచ్చింది. నయ్‌పాల్ వచ్చాడు. వాడిని రిసీవ్ చేసుకుని హోటల్‌లో దించి ఇప్పుడే వస్తున్నాను. ఇవేళ్టికి బైటికివెళ్లే పనులన్నిటికీ స్వస్తి. అవతారం వచ్చాడు గదా!"

ఫోన్ మోత —

దీక్షితులు ఫోన్ దగ్గరకు వెళ్లాడు.

"ఇవేళ స్టేట్స్‌మెన్ ఎడిటోరియల్ చూశారా? మీ మంత్రిత్వ శాఖ మీదే..."

దీక్షితులు చాలాసేపు మాట్లాడటంతో అటు పక్క ఉన్నవాడు కేంద్రమంత్రి అన్నది స్పష్టంగా తెలిసింది. సంభాషణ ఇంగ్లీషులో సాగింది. ప్రభుత్వం మీద చురకలు తగిలిస్తున్నాడు దీక్షితులు.

అవతారానికి కొత్త ప్రపంచంలో బంధించినట్టు ఉంది ఇక్కడ. చలికి అన్ని కిటికీలూ, తలుపులూ మూసేసి ఉన్నాయి. పైగా కర్టెన్‌లు. ఎన్నో ఎడారులు అక్కడ పోగయినంత శూన్యం. పిల్లలూ, పెద్దలూ ఎవరూ లేని ఇల్లు. కనీసం పిల్లులూ, కుక్కలూ కూడా లేవు. ఏ సందడీ లేదు. ఏడుపులూ, నవ్వులూ, అరుపులూ లేని గడ్డ కట్టుకుపోయినట్టు నిర్జీవవాతావరణం. కుటుంబఛాయలేవీ అక్కడ కన్పించటం లేదు.

ఆ ఫోన్ ప్రసంగం ముగిసిన వెంటనే దీక్షితులు తనే ఎవరికో ఫోన్ చేశాడు. ఆ నంబర్ ఒకంతట దొరకలేదు. ఈసారి ఆయన ఆ పత్రిక సంపాదకునితో మాట్లాడుతున్నట్టుంది. వ్యంగ్యంగా, సంపాదకీయాన్ని మెచ్చుకుంటున్నధ్వనితో మధ్య మధ్య నవ్వుకుంటూ నడుస్తున్నది సంభాషణ. అలాంటి సంపాదకీయాల్ని రాసే వాళ్లని జాతివిద్రోహులని, అమెరికా ఏజెంట్లని, ప్రతిపక్షాల తొత్తులని ముద్ర వేస్తుంది అధికారపక్షం. హిందూ దినపత్రిక బోఫోర్స్ వ్యవహారంలో వెల్లడించిన రహస్యాలతో, సాక్ష్యాధారాలతో, అధికార పత్రాలతో ప్రభుత్వం తలకిందులు కావలసిన పరిస్థితి గురించిన చర్చ వాళ్ల మధ్య. 'ఇట్లాంటి ఆధారంలో పదోవంతు దొరికితే మేడమ్ గాంధీ పది దేశాల్లో ప్రభుత్వాలను పడగొట్టేది. అటు స్వీడన్, ఇటలీ, స్విట్జర్లాండ్, ఇంగ్లండ్ — ఇంకా సంబంధమున్న అన్ని దేశాలలో ప్రభుత్వాలు కూలిపోయేవి. జనతా పాలనలో బెల్చీ అన్న ఓ మారుమూల గ్రామంలో జరిగిన హరిజన మారణకాండతో — ప్రతిపక్షనాయకురాలిగా మేడమ్ గాంధీ — నిండా అయిదేళ్లు నిండక ముందే ప్రభుత్వాన్ని మట్టి కరిపించిన వైనాన్ని చెప్పుకుని నవ్వుకుంటున్నారు

ఇద్దరూ ఫోన్‌లో. ఆ సంభాషణ చివర్లో 'నయ్‌పాల్ ఉదయం దిగాడు. దేశంలో నెల రోజులపాటు ఉంటాడట. తన కొత్త పుస్తకం సమాచారంకోసం వచ్చాడట. వివరాలు మాట్లాడుకోలేదు. ఇవేళ మా డ్రైవర్ సెలవు పెట్టాడు. దాంతో నేనే వెళ్లాల్సివచ్చింది పాలమ్. వాడిని హోటల్‌లో దించి వస్తున్నాను. విశాఖపట్నం నించి నా చిన్ననాటి స్నేహితుడు నా కోసం వచ్చాడు. అంచేత ఇవేళ బైటకార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నాను. మనం కలుసుకోవటం రేపటికి వాయిదా వేసుకోవచ్చుగా' అని ముగించాడు దీక్షితులు.

తనపట్ల దీక్షితులు చూపుతున్న ఆదరాభిమానాలు అర్థమై అవతారం చిన్ననాటి చెలిమికి సంతోషంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు. ఫోన్‌లో మాట్లాడటం ముగిసిన తర్వాత దీక్షితులు వచ్చి అవతారం దగ్గర కూర్చున్నాడు.

అంతలో దాదాపు పాతికేళ్ల వయసులో ఉన్న ఉత్తరాది పల్లెటూరు అమ్మాయి వేడివేడి కాఫీలు పట్టుకుని లోపలి నించి వచ్చి వారి ముందు పెట్టింది. ముగ్గురూ కాఫీలు అందుకున్నారు.

అదే తొలిసారి దీక్షితులు పరిశీలనగా అవతారాన్ని చూడటం.

పదమూడు పధ్నాలుగేళ్ల తన చిన్ననాటి స్నేహితుడు అవతారం, ఇవేళ ముఖంలో వర్చస్సుతో బాల్యపుచురుకుదనంతో, నిర్మలంగా, నిండుగా కన్పించటం దీక్షితులకు సంతోషంగా ఉంది. వయస్సుకన్నా చిన్నవాడిగా, ఆరోగ్యంగా కన్పిస్తున్నాడు. ఆపేదదుస్తులూ, నిరలంకారమైన రూపమూ నిరాడంబరమైన అందాన్నిచ్చాయి. ఆ చూపులు ఎదుటివాడి హృదయాన్ని ఆత్మీయంగా పలకరించేట్టుగా ఉన్నాయి.

"విశాఖపట్నం వచ్చినప్పుడల్లా నిన్ను కలుసుకోవాలనే అనుకునేవాడిని. మన కృష్ణంరాజు లేడూ, వాడు చెప్పాడు నీ గురించి. కలెక్టరాఫీస్‌లో నువ్వు ఉంటున్నట్టు."

"ఎప్పటి మాట! కృష్ణంరాజు చచ్చిపోయి పదిహేనేళ్లయింది."

"కృష్ణంరాజు అదృష్టవంతుడు. గుండెపోటుతో చనిపోయాడు. నిజానికి గుండెపోటంతటి సుఖమైన చావు వేరొకటి ఉండదనుకో" అని సంతోషంగా చెప్పి నవ్వాడు అవతారం

చనిపోయిన తమ బాల్యమిత్రుని ఆత్మశాంతికి ఆ ఇద్దరూ హృదయ పూర్వకంగా నవ్వుకున్నారు.

"కృష్ణంరాజు మనకు చెప్పకుండా వెళ్లిపోవడం మాత్రం అన్యాయం రా అవతారం" అన్నాడు దీక్షితులు.

"హఠాత్తుగా చావురావటం వల్లనేమో కృష్ణంరాజు మనల్ని మరచి పోయాడు. చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. ఇప్పుడక్కడ ఒక్కడూ ఎంత బాధపడుతున్నాడో!" అని మళ్లీ ఛలోక్తి విసిరి ఇద్దరూ తృప్తిగా చిరు నవ్వుకున్నారు.

"కుటుంబానికి ఏమన్నా ఆధారం లాంటిది మిగిల్చాడా?"

"ఎక్కడి కుటుంబం! వాడి భార్య రెండు మూడేళ్లు ముందే పోయింది."

"అలా చెప్పు. మనతో చెప్పకుండా కృష్ణంరాజు పోవడానికి అదీ కారణం" అని పగలబడి నవ్వాడు దీక్షితులు. మళ్లీ 'అదేవిట్రా, భర్తని వదిలేసి అట్లా ముందే వెళ్లిపోవడం?' అన్నాడు దీక్షితులు.

"దీక్షితులూ, నీకు తెలీదన్నమాట. కమల కూడా అదే పనిచేసింది. దాదాపు ఇరవయ్యేళ్లయింది. ఎ.వి.ఎన్. కాలేజీ చింతచెట్టుకన్నా ఒక్క రోజు ముందు. ఆ రోజు వర్షం రాత్రే" అని అవతారం సంతోషంగాను దరహాస వదనంతోనే చెప్పుకున్నాడు.

"ఒరేయ్ అవతారం, ఒక సంగతి చెప్పనా. కమల నిన్ను వదిలేసి భగవంతునితో వెళ్లిపోయిందిరా" అని మళ్లీ పగలబడి నవ్వాడు దీక్షితులు.

ఇద్దరూ మధ్యమధ్య కాఫీ చప్పరిస్తున్నారు. నవ్వుల మూలంగా కళ్లల్లో నీళ్లు వస్తుంటే తుడుచుకుంటున్నారు. సంభాషణ అందుకుని ముందుకు కొన సాగిస్తున్నారు. చూస్తున్న సత్యంకి ఆ చిన్ననాటి మిత్రుల ధోరణి వింతగా, కొన్నిసార్లు ఇబ్బందికరంగా ఉంది. తన ఉనికిని వాళ్లు గమనించినట్టు లేదు. రెండుపాత్రలు రంగస్థలంమీదికివచ్చి తమలోతాము మాట్లాడు కుంటున్నట్టుగా ఉంది సత్యానికి. వాళ్లు మాట్లాడు కుంటున్న విషయం ఆప్తుల మరణాల గురించి. అయితే వాళ్ల సంభాషణలో విచారంగాని, బాధగాని, సంతాపభావం గాని లేకుండా, హాస్యోక్తులతో, వ్యంగ్యాలతో, ఒకరికి మించి ఒకరు పోటీపడ్డట్టుగా మాట్లాడుతూ ఇద్దరూ నవ్వుకుంటున్నారు. సత్యానికి అంతా అయోమయం అన్పించింది. ఆ మాటల వెనక దాగిన దుఃఖం అతడి మనసులో గడ్డకట్టుకుపోయి నవ్వుకెరటం తలెత్తకుండా అణచివేసింది. పురుషుని జీవితంలో భార్య మరణం కన్న దుఃఖమూ, వేదనా ఏముంటుంది? అయినా వాళ్ల ముచ్చట్లలో ఆ విషాదం ఎక్కడా లేదు. సరికదా, ఎవరో పరాయివారి గురించి అయినట్టు తమకు ఏమీ సంబంధించనట్టు వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

ఆ స్నేహితుల వయసులో సగం కూడా లేని సత్యం ఇంగ్లీషు దిన పత్రికల్లో ముఖం పెట్టుకుని, వాళ్లను వాళ్ల చిన్ననాటి సంతోషాలకి విడిచిపెట్టేసి మౌనంగా ఉండిపోయాడు. అది గమనించిన దీక్షితులు "సత్యం ! నైట్ డ్యూటీ చేసినట్టున్నావ్

— అవునా ?" అని అడిగాడు.

అవునని తలూపి "రాత్రి అరడజను ఎమర్జెన్సీ కేసులు. వాటిల్లో నాలుగు ఫేలయ్యాయి. వాళ్లలో ఒక చిన్న పిల్లవాడు. మూడేళ్లు కూడా ఉండకపోవచ్చు. బతికించలేకపోయాం. చాలా బాధనిపించింది" సత్యాన్ని బాధించింది పిల్లవాని చావుకన్నా, నిండా ఇరవయ్యేళ్లు కూడా నిండని ఆ తల్లి శోకం. ఎంతకీ ఆ తల్లిరూపం అతడి కళ్లనించి చెరగిపోవటం లేదు.

"చావు భయం నిన్నింకా విడిచిపెట్టలేదంటే, నువ్వు వృత్తి పరంగా ఇంకా డాక్టర్‌వి కాలేదన్నమాట" అన్నాడు దీక్షితులు.

సత్యానికి చదువుకున్న రోజుల్నించి కూడా వైద్యవృత్తి అంటేనే పడదు. ఈ చదువు ఎందుకు చదివానా అన్నదే అతడి బాధ. ఈ చేసిన తప్పుకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నా ననుకుంటాడు. దాంతో ఉద్యోగం పట్ల రోజురోజుకీ ఉదాసీనత. డాక్టర్‌కు ఉండాల్సిన వృత్తి లక్షణాలేవీ సత్యానికి వంటపట్టలేదని స్నేహితుల విమర్శ. 'ఈ డాక్టర్ ఉద్యోగం మానేసి ఏ ఇంగ్లీషు దినపత్రికలోనన్నా జర్నలిస్ట్‌గా చేరకూడదా, నిత్యం ఇట్లా బాధపడేకన్నా' అంటుంది అతడి భార్య.

"ఎప్పుడో ఆ ఒడ్డుకే చేరుతుందీ కెరటం" అంటాడు భార్యతో సత్యం.

దీక్షితులు కోసం ఈసారి కేంద్రంలో కేబినెట్ హోదా మంత్రిగారు వచ్చారు. ఆయన్ని ఇదివరలో రెండుమూడుసార్లు సత్యం ఈ ఇంట్లోనే చూశాడు. ఖరీదయిన సూట్‌లో ఉన్నాడు. ఇద్దరూ లోపలి గదిలోకి పోయి, పది నిముషాల సేపు మాట్లాడుకుని వచ్చారు. తర్వాత ఆ మంత్రిగారు వెళ్లిపోయారు.

"ఒకప్పుడు ఈయన గురూజీ గురూజీ అని తిరిగేవాడు. రాజకీయ పార్టీ టోపీ పెట్టుకున్న తర్వాత ఈ పదేళ్లలో వైకుంఠపాళిలో నిచ్చెన్లు దొరికి, పదవుల్లో పైపైకి వచ్చేసి ఈ స్థాయికి చేరుకున్నాడు. ఇందిరాగాంధీ మరణానంతరం ఢిల్లీలో జరిగిన మారణకాండలో ప్రముఖుడు. ఏ సమావేశంలో నన్నా కలిసినప్పుడు 'వారు మా గురూజీ' అని నన్ను కొత్తవారికి పరిచయం చేసినప్పుడల్లా నాకు వెన్నులో చలి పుడ్తుంది" అని మధ్య మధ్య నవ్వుకుంటూ చెప్పాడు దీక్షితులు.

"వీళ్లను చూసినప్పుడు నా కెట్లా అన్పిస్తారంటే హాలివుడ్ సినిమాల్లోని మాఫియా అధినేతల్లా ఉంటారు." అన్నాడు దీక్షితులు.

అంతలో ఆ ఉత్తరాది అమ్మాయి రానే వచ్చింది.

"సీతా, ఏం పెడతావు మాకు తింటానికి" అని హిందీలో అడిగి ఆ అమ్మాయిని అవతారానికి పరిచయం చేశాడు దీక్షితులు. ఢిల్లీ సమీపంలో ఉన్న ఒక పల్లెటూరు

నించి రోజూ వచ్చే ఆ అమ్మాయి తనకు గత నాలుగేళ్లుగా వంట చేసి పెడుతున్నదట. ఆమెకి ఇద్దరు కొడుకులట. భర్త ట్రాక్టర్ డ్రైవర్. అవతారం దృష్టికి ఆ అమ్మాయి వంటమనిషిలా కన్పించలేదు. ఆ ఇంట్లో దీక్షితులు మనుమరాలులా కన్పించింది. పల్లెటూరు స్త్రీలలో కనిపించే సంప్రదాయ సిద్ధమైన అందాలు ఆమె చేతి గాజుల్లో, చీరెముసుగులో, నుదుట బొట్టులో, మెడ లోని మంగళ సూత్రంలో కన్పిస్తున్నాయి.

తన దగ్గర పదిహేనేళ్లు పనిచేసిన వంటవాడు నేపాలీ కార్తీక్•ముప్పయ్యేళ్లచిన్న వయసులో చనిపోయాడట. 'ఓ డాక్టర్ వాడిని నిలువునా చంపేశాడు' అని చెప్పి, 'కార్తిక్ పెళ్లి చేసుకోలేదు కాబట్టి బతికిపోయాడు' అని తన మాటలోని అర్థ వైరుధ్యానికి నవ్వాడు దీక్షితులు.

మళ్లీ ఫోన్. ఈ సారి సీతకు.

దీక్షితులు దగ్గరకు వచ్చేముందు సత్యం ఎన్నో వివరాలు అవతారానికి చెప్పాడు. ఆ మాటల్లో దీక్షితులు కుటుంబం గురించి ఏ సంగతీ చెప్పలేదు. తనూ అడగలేదు. ఆ ఇంట్లో పిల్లలూ, పెద్దలూ ఎవరూ కనిపించక పోయేసరికి దీక్షితులునే స్వయంగా అడగాలనుకున్నాడు అవతారం. ఆ పెద్ద ఇల్లు లైబ్రరీ గదిలా, మ్యూజియమ్‌గదిలా ఉందే తప్ప ఒక కుటుంబం నివసించే ఇల్లులా కనిపించలేదు. బైటకార్లు, స్కూటర్‌ల హారన్ మోతలు, పాలమ్ విమానా శ్రయానికి వచ్చే పోయే విమానాలురొద, మధ్యమధ్య టెలిఫోన్ సందడి, చెట్ల మీద పిట్టల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

మాటల్లో సందు దొరికించుకుని, 'ఒరేయ్ దీక్షితులూ, నీ కుటుంబం ఎక్కడోయ్' అని ఉండబట్టలేక అడిగేశాడు. అదే ప్రశ్నని వేరేవాళ్లు తనని అడిగితే క్షమించలేని అవతారం.

"ఈ ప్రపంచమంతా మన కుటుంబమే" అన్నాడు దీక్షితులు. వెంటనే విలువైన ఒక నవ్వు నవ్వాడు.

దీక్షితులు చూపు మెట్ల గది అరుగు మీద నించున్న స్త్రీ మూర్తి నిలువెత్తు శిల్పం మీద నిల్చింది.

హుస్సేన్ గుర్రాలు విశాల ప్రపంచంలోకి పరుగులు తీస్తున్నాయి. శైలజ్‌ముఖర్జీ గ్రామీణవాతావరణం ఆకుపచ్చగా, నీలంగా, విశాలంగా వ్యాపిస్తున్నది. రామ్‌కుమార్ సిటీలాండ్‌స్కేప్ తమ చుట్టూ ఆవతరించిన మహా నగరంలా ఉంది. ఆ మధ్యలో ఇంటియజమాని కోసం ఎదురు చూస్తున్న కుటుంబంలా ఉంది అమృతా షెర్‌గిల్ 'వనితలు' దృశ్యం. జీవితమంతా ప్రియా వియోగంతో ప్రియుని ఒంటరి జీవితం పట్ల

దిగులుతో చూస్తున్నది మెట్లగది అరుగుమీది స్త్రీమూర్తి విగ్రహం!

అవతారం దృష్టి ఆ కళాఖండాల మీంచి దీక్షితులు మీద పడింది. 'ఆ ప్రమాదం తప్పిపోయింది జీవితంలో' అన్నాడు, తనను చూసి తనే నువ్వుకునే దీక్షితులు. 'స్వంత కుటుంబం ప్రమాదం నుంచి తప్పించుకోవడం జీవితంలో గొప్పవరం. లేకపోతే సంపాదన — సంపాదన — అనుకుంటూ తుచ్ఛ యావతో పిచ్చెత్తి పోవాలి. జీవితంలో పెళ్లి, సంతానం పెద్ద చీదర. అంతా తమకే, తమదే అన్నట్టు మనుషులు కక్కుర్తిపడి నిత్యదరిద్రులవుతారు. శాపగ్రస్త ముఖాల్తో, జిడ్డోడుతూ, దొంగ మర్యాదలతో, నటనలతో, వంచనలతో, కుళ్లు మనసులతో, కంపు ఆలోచనలతో ఎంత అసహ్యంగా, మురికిగా తయారవుతారో మనుషులు' అని కుటుంబజీవనంతో వెన్నంటి వచ్చే స్వార్థం అవగుణాల పట్ల తన అసహనాన్ని ప్రకటించాడు దీక్షితులు.

సత్యానికి దీక్షితులు అంతరాంతరాల నుంచి వస్తున్న భావజాలం కనువిప్పులా తోచింది. దీక్షితులు వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకునే సందర్భం ఇట్లా కుదిరినందుకు అతనికి సంతోషంగా ఉంది. దీక్షితులు పట్ల ప్రగాఢమైన ఆరాధనాభావంతో ఉన్న అతనికి ఈ సంభాషణ ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. మనసు పెట్టి దీక్షితులునే వింటున్నాడు.

దీక్షితులు ఫలహారం గురించి ఏం చెప్పకముందే సీత వెళ్లిపోయింది.

దీక్షితులు చెప్పిందంతా వైరాగ్యం వడబోసినట్టుగా ధ్వనించింది అవతారానికి.

"అవతారం, అది సరే గాని నువ్విప్పుడు ఎక్కణ్ణించి వస్తున్నట్టు? ఇక్కడ ఈ చలికాలం ఢిల్లీలో ఎక్కడ ఉంటున్నట్టు?" అని దీక్షితులు అడిగేసరికి అవతారం చిక్కుల్లో ఇరుక్కున్నాడు. ఇట్లాంటి ప్రశ్నలు అడిగేవాళ్లంటేనే అవతారానికి చుక్కెదురు. వెంటనే అక్కణ్ణించి అదృశ్యమైపోతాడు.

అయితే దీక్షితుల ప్రశ్నల వెనక స్నేహహృదయం ధ్వనించి క్షమించాడు. అయినా ఏం చెబుతాడు? నా అన్నవాళ్లు ఎవరూ మిగలని ఈ ప్రపంచంలో గత ఏడెనిమిదేళ్లుగా బైరాగై యాత్రలు చేస్తున్నాడు. ఇట్లా ఎప్పుడో ఒక కెరటం తనను మనుషుల మధ్యకు నెట్టినపుడు అతడికి ఇసికలోపడ్డ చేపలాగ ఉంటుంది. వాళ్ల మాటలు, వాళ్ల భాష, వాళ్ల విలువలు అతడికి అర్థంకావు. ఇవేళ ఇక్కడ మునిగితే మళ్లీ ఎక్కడ తేలేదీ అతడికే తెలీదు.

అవతారం తన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా సందేహించడం చూసి దీక్షితులు...

"ఇది మన స్వంతఇల్లు. ఈ ఇంట్లో నేను ఒక్కణ్ణే. సీత ఉదయం ఓ రెండు

గంటలు సాయంత్రం ఓ రెండు గంటలు, వచ్చి పని చేసి పోతుంది" అని క్షణం ఆగి, జ్ఞాపకాలను తిరగేసి, "ఒక అమృత హృదయం ఈ ఇల్లు కట్టిన కొత్తలో ఈ జీవితంలో అడుగుపెట్టినట్టే పెట్టి దగ్గరకు రాకుండానే శాశ్వతంగా మాయమైపోయింది" అని మెట్ల గది మూల అరుగుమీద నుంచున్న యౌవన స్త్రీ మూర్తి నిలువెత్తు శిల్పాన్ని చూస్తూ నిశ్శబ్దంలో మునిగిపోయాడు.

"అయితే ఇప్పుడు మరో ప్రమాదం పట్టుకుని నన్ను పీడిస్తోంది. జీవితంలో నేనెరగని నా బంధువులు వచ్చి, నామీద ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తున్నారు, ముసలితనంలో నన్ను ఆదుకోవాలని" అని క్లుప్తంగా తన వర్తమాన జీవితం గురించి చెప్పుకున్నాడు దీక్షితులు.

ఢిల్లీ మహానగరంలో ఆ ఇల్లు, దాదాపు పాతికేళ్ల క్రితం ఆ కాలనీ ఏర్పడుతున్న రోజుల్లో ఒక స్నేహితుడి ఒత్తిడి మీద దీక్షితులు కట్టించుకున్నాడు. ఆ ఇల్లు నిర్మాణదశలో ఎందరెందరో మిత్రులు తోడ్పడ్డారు. ముఖ్యంగా ఒక ఆర్కిటెక్ట్ మిత్రుడు ఆదినుంచీ స్వయంగా ఎంతో శ్రద్ధ తీసుకుని దాని రూపురేఖలు తీర్చిదిద్దాడు. వసంత్ విహార్ లాంటి సంపన్న నివాస ప్రాంతంలో నిరాడంబరమైన ఆ ఇంటి అందం ఆ మిత్రుని చేతిచలువే. ఒక గొప్ప కళాఖండంలా తరగని అందం ఆ బంగళా.

"సత్యం, నిన్న నా జన్మ దినోత్సవం జరుపుకున్నా తెలుసా? అవిగో ఈ నటరాజవిగ్రహం దగ్గరున్న పుష్పగుచ్ఛాలు అవే. మా రాఘవ తెచ్చి ఇచ్చిపోయాడు, అని "సీతా నిన్న రాఘవ తెచ్చిన మిఠాయి తెచ్చి పెట్టు" అని దీక్షితులు సీతని తెలుగులోనే ఆదేశించాడు. ఢిల్లీలో ప్రసిద్ధమైన ఘంటేవాలా మిఠాయి అది.

"అవతారం, నువ్వు ఇక్కడ నా దగ్గర ఉన్నా సదుపాయంగానే ఉంటుంది. నీకు వంట చేయడం వచ్చిందనుకో, సీతకు ఓ నెల రోజుల సెలవు మంజూరు చేయవచ్చు. పాపం నేను సి.ఏ నుంచి బైటికి వెళ్తేనే తప్ప సీతకు సెలవు దొరకదు."

అంతలో బ్రేక్‌ఫాస్ట్ రానే వచ్చింది.

బ్రెడ్ టోస్ట్, బట్టర్, జామ్. ఒక ప్లేట్‌లో వెజిటిబుల్ సలాడ్. రెండు గ్లాసుల్లో పండ్ల రసం. ఒక గ్లాసులో మజ్జిగ. ఒక ప్లేట్‌లో మిఠాయి.

"ఇవేళ ఉప్మా చేయకపోయావా? మా అవతారం తెలుగు వంటకాలు తిని ఎన్నాళ్లయిందో" అని స్వీట్ ప్లేట్‌ని సత్యం వేపు, అవతారం వేపు పెట్టి "సర్లే తర్వాత చేయవచ్చు. అవతారం నాతో ఉంటాడులే" అని స్నేహితుడిని తన దగ్గర ఉంచేసుకోవాలన్న అభిమానం ప్రకటించాడు దీక్షితులు.

"మన సత్యం బ్రహ్మాండమైన తెలుగు వంటకాలను రుచి చూపుతాడు.

ఎప్పుడన్నా బుద్ధి పుడితే సత్యానికి టెలిఫోన్ చేసి అటువస్తున్నా అని చెబుతాను. నిర్మల ఆ రోజు సెలవు పెట్టి తనే స్వయంగా వండుతుంది' అని సత్యం వేపు చూసి, 'సత్యం, మళ్లీ తెలుగు భోజనం ఎప్పుడు పెడుతున్నావ్?" అని నిలదీసి అడిగాడు దీక్షితులు.

సత్యం స్నేహితులు తెలుగుదేశంనించి ఢిల్లీ వచ్చినప్పుడల్లా తెలుగు రుచులు తీసుకు వస్తూనే ఉంటారు. తెలుగుఆవకాయలు, పచ్చళ్లు, దోసకాయలు, కారప్పొడులు, అరిసెలు, పూతరేకులు, తొక్కుడు లడ్డూలు, సున్ని ఉండలు, బందరు మిఠాయి, జీడిపప్పుల్లాంటివి. అవి వచ్చిన వెంటనే వాటిని పట్టుకుని దీక్షితులు దగ్గరకు వస్తాడు సత్యం.

"తెలుగుదేశం ఎంతగొప్పదో" అని మురిసిపోతాడు దీక్షితులు.

టెలిఫోన్ మోగింది.

మన దేశపర్యటనలో ఉన్న బ్రిటిష్‌మంత్రి పత్రికాసమావేశానికి సంబంధించి బ్రిటిష్ హైకమిషన్ నుంచి ఫోన్. ఆహ్వానం లాంఛనంగా ఇదివరకే అందింది. ఇది మరోసారి గుర్తు చేయటం.

సత్యం తీరిక చిక్కినప్పుడల్లా దీక్షితులు దగ్గరకు వచ్చి ఆయనతో కూర్చుంటాడు. మన దేశంలో ఇంగ్లీషు జర్నలిస్టుల ప్రపంచంలో భీష్ముని వంటి దీక్షితులు అంటే సత్యానికి ఎంతో భక్తి. ఢిల్లీ చూట్టానికి వచ్చిన తన స్నేహితులకు రాజ్‌ఘాట్ చూపించినా చూపించకపోయినా దీక్షితుల్ని మాత్రం వాళ్లు తప్పక చూసి వెళ్లాల్సిందే. ఆ ఇంట్లో ఎందరెందరో సీనియర్ జర్నలిస్టులను, వివిధ భారతీయ భాషలకు చెందిన సాహితీవేత్తలను, ప్రఖ్యాత చిత్రకారులను, సంగీతవేత్తలను, దౌత్య వ్యవహర్తలను, స్వాతంత్ర్యసమర యోధులను, మహా పురుషులను సత్యం కలుసుకున్నాడు. వాళ్లతో మాట్లాడాడు. వాళ్లకు సేవ చేసే భాగ్యం కూడా కలిగింది. సంపాదకుని స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు మారుపేరని పించుకున్న దీక్షితులు నిజజీవితంలో నిరాడంబరజీవి, నిర్మల హృదయుడు, స్నేహ ప్రియుడు. ఓపది రోజులు సత్యం కనిపించకపోతే ' ఏమయింది సత్యం, అసలు కన్పించడమే లేదు' అని పిలిపించుకునే ప్రేమకి, ఆత్మీయతకి సత్యం గర్వపడతాడు. దీక్షితులు దగ్గర కూర్చుని ఆయన చెప్పే ముచ్చట్లు, అభిప్రాయాలు, అనుభవాలు వింటుంటే – ఒక మహర్షి దగ్గర శుశ్రూష చేసినంత సంతోషం. స్వాతంత్ర్య పోరాటకాలం నాటిచారిత్రక ఘటనలను, కోటంరాజు పున్నయ్య, కోటంరాజు రామారావుల వంటి సంపాదకులు పత్రికారంగంలో చేసిన సాహసాలను, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన

మహోన్నత త్యాగాలను విన్నప్పుడు దేశ వర్తమాన చరిత్ర కళ్ల ముందు కదిలి భయపెడుతుంది. గంగానది మురికికాలవై, పందులకు నిలయమై పోయినందుకు బాధ కలుగుతుంది. దాంతో దీక్షితులుతో స్వీయచరిత్ర రాయించాలన్న దీక్షపూనాడు సత్యం. 'నీవే చేయించాలి ఆ పని' అని దీక్షితులు అభిమానులు సత్యాన్ని ప్రోత్సహించారు. మేనేజ్‌మెంట్‌కీ, దీక్షితులుకీ ఎప్పుడూ ఏకాభిప్రాయం కుదరక పెద్ద పెద్ద దినపత్రికలలో పనిచేసి చివరికి ఇప్పుడు ఫ్రీలాన్సర్‌గా ఉండిపోయాడు దీక్షితులు. భారత దేశ వర్తమాన రాజకీయ పరిణామాల గురించి ప్రముఖ విదేశీ పత్రికలకు తరచు రాసే దీక్షితులుపేరు దేశంలోని కొత్తతరం పత్రికా పాఠకులకు తెలీదనే చెప్పాలి.

ఇప్పుడొచ్చిన కేంద్ర మంత్రి ఆ పని మీదే వచ్చి మాట్లాడాడు. గతవారం 'గార్డియన్'లో వచ్చిన దీక్షితులు వ్యాసంలో వెల్లడించిన అభిప్రాయాల గురించి చర్చించడానికి వస్తున్నట్టు ఇది వరకే ఫోన్ చేసి చెప్పాడు. మన విదేశాంగవిధానం గురించి దీక్షితులికి చదువుచెప్పి వెళ్లాడు. అయితే ఈ మంత్రిగారు నిజం చెప్పాడు. ఆ వ్యాసం అతడు చదవనేలేదట. తన కార్యదర్శి ఆ వ్యాసంలోని సారాంశం సంగ్రహంగా చెప్పాడట. అయితే కొంతమంది పార్లమెంట్ సభ్యులు, వాళ్ల అనుచరులు, కార్యకర్తలు నేరుగా ఫోన్ చేసి బెదిరించి మాట్లాడతారు. అట్లాంటి బెదిరింపులు ఇటీవలి కాలంలో దీక్షితులుకి మామూలై పోయాయి. చిత్తశుద్ధిగల పత్రికా రచయితలకు నేడు పత్రికారచన కత్తిమీద సాము అయిపోయింది. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, భావ స్వాతంత్ర్యం యుగసంధిలో నవ్వులు పాలవుతున్న మానవతా విలువల్ని చూస్తే నవ్వొస్తుంది దీక్షితులుకి.

దీక్షితులు జీవితానికీ, తన జీవితానికీ మధ్య కొట్టవచ్చినట్టుగా ఎన్నో పోలికలు కనిపించాయి అవతారానికి. ఇద్దరికీ తల్లిదండ్రులు లేరు. ఈ వయసులో సైతం తల్లిదండ్రుల సేవచేసేవాళ్లను తను ఎందర్ని చూడలేదు! ఇద్దరికీ కుటుంబాలు లేవు, పిల్లల్లేరు, భార్యలు లేరు. బ్రహ్మచర్యంతో మిగిలిన దీక్షితుల గతీ, పెళ్లి చేసుకుని పిల్లల్ని కని అందర్నీ కోల్పోయిన తన గతీ ఒకలానే ఉంది. సంతోషాలతో మునిగితేలిన రోజులు, దుఃఖంతో కుమిలి కుంగిపోయిన రోజులు తను రుచి చూశాడు. దీక్షితులు జీవితంలో కూడా అవి అనుభవం అయినట్టే ఉన్నాయి. పెళ్లి — పిల్లలరూపంలో కాకపోవచ్చు. ఒక అమృతహృదయం జీవితంలో అడుగు పెట్టినట్టే పెట్టి శాశ్వతంగా అదృశ్యమై పోయిందంటే చాలదా! అది కూడా చావే కదా! తనలాగే దీక్షితులు కూడా మొండివాడే, ఇంకా బతుకుతున్నాడు. భార్య చనిపోయిన రోజుల్లో

సముద్రంలో పడిచావాలని ఎన్నిసార్లు వెళ్లలేదు తను! భార్యాపిల్లల జ్ఞాపకాలకు ప్రాణం పోయాలని బతుకుతున్నాడు. కమల జ్ఞాపకాలు ఉన్నంతకాలం కమల తనలో బతికే ఉంటుంది చిరంజీవిగా. కమల తనతో ఉన్నట్టే ఉంటుంది. తనతో మాట్లాడుతున్నట్టే ఉంటుంది. కాలం అన్న నాణేనికి బొమ్మ — బొరుసు చావు బతుకులు, అంతే. కమలతో తను నిత్య సంచారిగా దేశాటనలో సంతోషం పొందుతున్నాడు. ఎందుకీ దేశ దిమ్మరి బతుకు అని కమల నోటి నించి వినిపిస్తే ఇంక ఈ బైరాగి జీవితానికి స్వస్తి చెబుతాడు. ఈ రోజు దీక్షితులు 'నీకు వంట వచ్చిందనుకో' అన్నప్పుడు 'ఎంతకాలమీ దేశాటన అన్నట్టు' దీక్షితుల మాట గుండెను పట్టుకుంది. అందుకే ఈ నిమిషమే తన బైరాగి బతుకు మీద తొలిసారిగా అలసట తోచింది. తన కళ్ళకు నిద్ర సోకుతున్నది. వేలాదిదేవాలయాల్లో, పవిత్రమైన నదీజలాల్లో, సరస్సులలో దొరకని శాంతి దీక్షితులు స్నేహంలో దొరకటం అపురూపమైన పరిష్కారంగా తోచింది అవతారానికి. తనకు ఇల్లుంది, ఇల్లు చేరాలి.

"అవతారం, అది సరే నువ్వు ఇప్పుడు ఎక్కణ్నించి వస్తున్నట్టు? ఇక్కడ ఈ చలికాలంలో ఢిల్లీలో నువ్వు ఎక్కడ ఉంటున్నట్టు" అన్న దీక్షితులు ప్రశ్నకు అవతారానికి సమాధానం తోచింది.

"పంతులు —ఇక్కడ గ్రీన్ పార్క్‌లో ఉంటాడు... తమ్ముడు... పినతల్లి కొడుకు. వాడి తల్లీ, నా తల్లీ అక్కా చెల్లెళ్లు. ఈ ఉత్తరాదిలో యాత్రలు చేసినప్పుడల్లా ఢిల్లీ వస్తే అవతారం వాడి దగ్గరే ఉంటాడు. వాడికి ఒకతే కూతురు. ఆ అమ్మాయి చనిపోయింది. ఇద్దరు మనుమలు. వాళ్లను పెంచుకుంటూ బతుకుతున్నాడు పంతులు. ఆ అల్లుడు రెండోపెళ్లి చేసుకున్నాడు"

అక్కడే సత్యంతో పరిచయం అవతారానికి.

"శ్యామల స్వయంగా డాక్టర్. సెరిబ్రల్ హెమరేజ్‌తో చిన్నవయసులో చనిపోయింది" అన్నాడు సత్యం.

మళ్లీ స్నేహితులు ఇద్దరూ పగలబడి నవ్వారు.

"డాక్టర్ అయితే చావుండదా సత్యం" అని ఒక వ్యాఖ్యానాన్ని విసిరాడు దీక్షితులు.

"అంత చిన్న వయసు. ముప్ఫయ్యేళ్లు కూడా ఉండవు. ఇన్‌స్టిట్యూట్‌లో మేమిద్దరం ఒకే రోజున చేరాం ఉద్యోగాల్లో." అన్నాడు ఈసారి సత్యం.

మళ్లీ నవ్వాడు దీక్షితులు.

"చిన్న వయసులో చావుండదా సత్యం.?"

అవతారం గొంతు కలిపాడు ఈసారి. సత్యానికి వాళ్ల నవ్వు అసందర్భంగా ఉంది, అసభ్యంగా ఉంది. అక్కణ్ణించి లేచి వెళ్లిపోవాలను కున్నాడు. పైగా నిద్ర ముంచుకొస్తున్నది. రాత్రి నిద్ర లేదు.

"చూడు సత్యం. కాలాన్ని మనం చావు పుట్టుకలతో లెక్క కడతాం. కాని చావూ కాలమూ ఒకటే. అందుకే మన పెద్దలు కాలం చేసాడంటారు" అన్నాడు దీక్షితులు.

ఆ రాత్రి సుమారు పది గంటలప్పుడు దీక్షితులు చదువుకుంటూ ఉండగా టెలిఫోన్ మోగింది. సీత తమ్ముడు ఫోన్ చేస్తున్నాడు. సీతకు ప్రమాదంగా ఉందట. సిటీలో ఆస్పత్రిలో చేర్చటానికి తీసుకు వెడుతున్నారట. హాస్పిటల్ దగ్గరకు వెంటనే బయల్దేరి రమ్మంటున్నాడు. ఆమె రాత్రి బస్సులో ఇంటికి వస్తుంటే ఘోరం జరిగిందట. ఆమెని బస్ నించి దించి మానభంగం చేశారట.

మెట్లగది అరుగు మీది నిలువెత్తు స్త్రీ మూర్తి శిల్పం కంపించినట్టు కనిపించింది దీక్షితులుకి.

అంతసేపు నవ్వుతూ మాట్లాడుకుని, సాయంత్రం సీత చేసిపెట్టి వెళ్లిన రొట్టెలు తిని, అవతారానికి నిద్ర ముంచుకురావటం చూసి పడుకోమని చెప్పి, తను వచ్చి చదువుకుంటూ ఉండగా ఈ భయంకరమైన వార్త.

దీక్షితులికి ఇప్పుడు నవ్వు రాలేదు.

దీక్షితులుకి ఆ నిమిషాన మనసు మొద్దుబారిపోయింది. అవతారాన్ని నిద్ర లేపి ఆ చలిలో కారు బైటికి తీసి, సత్యం పని చేస్తున్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి దారి తీశాడు.

పొగమంచు. కన్నీళ్లు. ఆందోళనతో కొట్టుకుంటున్న గుండె. తన కలం మీదికి శత్రువు దాడి. తన కలంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న గంగానది మీదికి శత్రువు దాడి.

అప్పుడు చందమామ మీద. ఇప్పుడు జాబిల్లి మీద.

* * *

*ఆంధ్రజ్యోతి దీపావళి వార్షిక సంచిక*

*1989*